క్లుప్తంగా

బాలగంగాధర్‌తిలక్‌కు నివాళి



బాలగంగాధర్‌తిలక్ చిత్రపటం వద్ద నివాళి

పెద్దపంజాణి: నాగిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బాలగంగాధర్‌తిలక్ జయంతిని హెచ్‌ఎం బాబురెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఉపాధ్యాయులు మీనాక్షి, వాణిశ్రీ, అంజప్ప, రాజేష్ పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయం తనిఖీ

పుంగనూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని పలమనేరు డీఎస్పీ విష్ణురఘువీర్ మంగళవారం తనిఖీ చేశారు. మదనపల్లెలో రికార్డులు కాలిపోవడంతో ఆయన పుంగనూరు కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యాలయంలో రికార్డుల భద్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తహసీల్దార్ శివయ్యతో చర్చించారు. రికార్డుల భద్రత కోసం పోలీస్ గస్తీ ఏర్పాటు చేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు అందజేస్తున్న సయ్యద్‌మౌల

పుంగనూరు: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు మంగళవారం జిల్లా ఇంటర్మీడియట్‌శాఖ విద్యాధికారి సయ్యద్‌మౌల పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత చదువులు చదవాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ప్రైవేటుకు దీటుగా బోధన ఉందని ఆయన తెలిపారు. ప్రిన్సిపల్ కమలాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓ

వి.కోట: మండలంలో విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వి.కోట మేజర్ పంచాయతీలో పారిశుధ్య పనులు చురుగ్గా చేస్తున్నట్లు ఈఓ యాదవపతి తెలిపారు. మంగళవారం ఆయన పట్టణంలోని వి.కోట–పలమనేరు మెయిన్‌రోడ్డు ఇరువైపులా మురుగు కాలువలు, శుభ్రపరచడంతో పాటు, ఖాళీ ప్రదేశాల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రిన్సిపల్

పుంగనూరు: స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాచ్ ఉమన్‌గా పనిచేస్తున్న పాపులమ్మ గత నెలలో రోడ్డు ప్రమాదానికి గురైంది. ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది కలసి రూ.32 వేల నగదును విరాళంగా ఆమెకు అందజేసి త్వరగా కోలుకోవాలని కోరారు.


సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



రికార్డులు పరిశీలిస్తున్న జయశంకర్

బైరెడ్డిపల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ పేర్కొన్నారు. బైరెడ్డిపల్లె ప్రభుత్వాస్పత్రిని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం బైరెడ్డిపల్లె వీధుల్లో పర్యటించి డెంగీ, మలేరియా జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మంచినీటి నిల్వలపై మూతలు ఉంచాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ పనుల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని అన్నా క్యాంటీన్ పనులను స్థానిక కమిషనర్ రమణారెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆపై గుడియాత్తం రోడ్డులోని కంపోస్టు యార్డును పరిశీలించారు. టీఎస్ అగ్రహారం, గంటావూరు సచివాలయాలను తనిఖీ చేసి అక్కడి రికార్డులను పరిశీలించారు. అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఏఈ రూపేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలూ..గళం విప్పండయ్యా!

- దశాబ్దాలుగా పట్టి పీడిస్తున్న ఏనుగుల సమస్య
- ముందుకు సాగని గంగమ్మ, కైగల్ ప్రాజెక్టుల నిర్మాణం
- ఇంటిగ్రేటెడ్ టమాట మార్కెట్‌పై రైతాంగం ఆశలు
- అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరుతున్న నియోజకవర్గ ప్రజలు



పలమనేరు పరిసరాల్లో ఏనుగుల మంద (ఫైల్)



పలమనేరు: అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవడంతో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమస్యలు ప్రస్తావించి పరిష్కారానికి కృషిచేయాలని నియోజకవర్గ ప్రజలు ఆశిస్తున్నారు. నియోజకవర్గ సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తి వాటిని పరిష్కరించి అభివృద్ధికి బాటలు వేయాలని ప్రజలు ఆశిసిస్తున్నారు..

మూడు దశాబ్దాలుగా 'గజ..గజ'

నియోజకవర్గాన్ని మూడు దశాబ్దాలుగా ఏనుగుల సమస్య పీడిస్తోంది. ఏనుగుల దాడుల్లో ఇప్పటికే 20మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది ఎకరాల్లో పంటలను ఇవి దెబ్బతీశాయి. పంట నష్టంతో రైతులు కుదేలయ్యారు. ఏనుగుల కట్టడి కోసం గత ప్రభుత్వాలు సోలార్ ఫెన్సింగ్, ఎలిఫెంట్ ట్రెంచ్‌లను ఏర్పాటు చేసినా ఇవి ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇటీవలే రైతులు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి ఏనుగుల సమస్యను నివేదించారు. కర్ణాటక నుంచి శిక్షణ పొందిన ఏనుగులను రప్పించి వాటితో ఇక్కడి ఏనుగులను కట్టడి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

గంగమ్మ శిరస్సు ప్రాజెక్టు

మండలంలోని కాలువపల్లె వద్ద రూ.55 కోట్లతో నిర్మించిన వైఎస్సార్ జలాశయానికి అనుసంధానంగా నలగాంపల్లె వద్ద 2008లోనే గంగమ్మ శిరస్సు ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకున్నారు. అయితే ఈ పనులు ముందుకు సాగలేదు. ఈ పనులు మొదలైతే 63.71 క్యూసెక్కుల వరద నీటిని వైఎస్సార్ జలాశయానికి మళ్లించవచ్చు. దీంతో పలమనేరు దాహార్తి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి అవకాశం ఉంటుంది.

కైగల్ రిజర్వాయర్

నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లె మండలం కైగల్ నదిపై గత ప్రభుత్వాలు రిజర్వాయర్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అటవీశాఖ అభ్యంతరాలు సైతం తొలగాయి. ఆపై ఆర్థికశాఖ క్లియరెన్స్ లేక పనులు ఆగిపోయాయి. ఈ పనులు మొదలైతే బైరెడ్డిపల్లె మండలంలో చెరువుల అనుసంధానంతో సాగు, తాగు నీటి సమస్యలు తీరుతాయి.

ఇంటిగ్రేటెడ్ టమాట మార్కెట్

గత టీడీపీ హయాంలో పట్టణ సమీపంలోని క్యాటిల్‌ఫాం వద్ద 33 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ టమాట మార్కెట్ నిర్మించాలని యోచించారు. ఆ తర్వాత వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొంత వరకు నిధులు సైతం మంజూరయ్యాయి. ఇక్కడ మార్కెట్ ఏర్పడితే ఈ ప్రాంతంలోని టమాట రైతులకు ఎంతో మేలు కలిగిన అంశం. ఈ హామీలను గత ఎన్నికలప్పుడు పలమనేరుకు వచ్చిన చంద్రబాబు ముందు స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సైతం చేస్తామని హామీ ఇచ్చినవే.. అసెంబ్లీ సమావేశాల్లో వీటిపై ఎమ్మెల్యే గళం విప్పాలని ప్రజలు కోరుతున్నారు.

ఏనుగుల సమస్యకు పరిష్కారం దొరికితే చాలు



నియోజకవర్గంలో మూడు దశాబ్దాల నుంచి ఏనుగుల సమస్య ఉంది. ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. ఎలిఫెంట్ ట్రెంచ్‌లను ఏనుగులు ధ్వంసం చేసేస్తున్నాయి. సోలార్ ఫెన్సింగ్‌ను నాశనం చేసి రైతుల పంటలపై పడుతున్నాయి. దీంతో అటవీ సమీప గ్రామాల్లో పంట పొలాలు బీళ్లుగా మారాయి. దీనిపై కూటమి ప్రభుత్వం పట్టించుకోవాలి. లేదంటే రైతులకు ఇబ్బందులు తప్పవు.

– విజయ్‌స్వామి, కీలపట్ల

గంగమ్మ శిరస్సు ప్రాజెక్టుతోనే దాహార్తి తీరేది



గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కాలువపల్లి వద్ద జలాశయాన్ని నిర్మించారు. దీని ద్వారా పట్టణానికి మంచినీరు అందేది. వర్షాలు రాకుంటే కౌండిన్య నది పారక డ్యాంకు నీరు రాదు. అందుకనే జలాశయానికి సమీపంలోని నలగాంపల్లి గంగమ్మ శిరస్సు ప్రాజెక్టు ద్వారా నీటిని వైఎస్సార్ జలాశయానికి మళ్లిస్తే పట్టణంలో మంచినీటికి ఎలాంటి సమస్య ఉండదు. ఈ పనులు ప్రారంభమయ్యేలా ప్రభుత్వం కృషిచేయాలి.

– గేట్ బాబు, పలమనేరు

హామీలు నెరవేరుస్తారా బాబూ?

కుప్పం: రాష్ట్ర ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే నారా చంద్రబాబునాయుడు కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తారని స్థానికులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రధానంగా కుప్పం నియోజకవర్గంలో ప్రజల ఆకాంక్ష ఉపాధి. 35 ఏళ్లుగా కుప్పం ఎమ్మెల్యేగా, 14 సంవత్సరాలుగా రాష్ట్రానికి సీఎంగా పాలన సాగించినా కుప్పంలో ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు. 15 ఏళ్లుగా చాలామంది నియోజకవర్గం నుంచి నిత్యం కూలీ పనుల కోసం బెంగళూరుకు రాకపోకలు సాగిస్తున్నారు. కుప్పంలో పారిశ్రామికవాడ ఏర్పాటు చేస్తామని 2001నుంచి చంద్రబాబు హామీలు ఇవ్వడంతోపాటు పట్టణ సమీపంలోని తంబిగానిపల్లి వద్ద శిలాఫలకం వేశారు. కానీ కార్యరూపం దాల్చలేదు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలైనా నెరవేరుస్తారని, కనీసం పరిశ్రమలు తీసుకొస్తే కుప్పం ప్రజలకు ఉపాధి లభిస్తుందని నియోజకవర్గ ప్రజలు ఆశ పడుతున్నారు. నియోజకవర్గానికి తాగు, సాగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో హంద్రీ–నీవా కాలువ పనులు పూర్తి చేశారు. ఇప్పుడు పాలారు ప్రాజెక్టు పూర్తి చేస్తే కుప్పం ప్రాంత ప్రజలకు నీటి సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని స్థానికులు అంటున్నారు. దీంతో పాటు ఎన్నికల హామీల్లో బెంగళూరు నుంచి ఫోర్‌లేన్ రోడ్డు, కుప్పం నుంచి పలమనేరు ఫోర్‌వే రోడ్డు, ప్రతి ఇంటికి నీటి కొళాయి కనెక్షన్ ఏర్పాటు చేస్తారని ఎదురుచూస్తున్నారు.

సామాన్యుడి కోరికలు తీర్చండి



సోమల..ఆవులపల్లె వద్ద అర్ధంతరంగా ఆగిపోయిన ప్రాజెక్టు పనులు

పుంగనూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి వైపు పరుగులు తీసిన పుంగనూరు నియోజకవర్గం ఒక్కసారిగా అధికార పార్టీ వ్యక్తిగత కక్షలకు బలికానుంది. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి గెలవడాన్ని అధికార పార్టీ జీర్ణించుకోలేకపోతోంది. ఎంపీ, ఎమ్మెల్యేలు నియోజకవర్గంలోకి రాకూడదంటూ ప్రభుత్వం పోలీసులతో నిర్బంధించే స్థాయికి దిగజారిపోవడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది.

పుంగనూరు, మదనపల్లె, పలమనేరు, చంద్రగిరి నియోజకవర్గాలకు చెందిన 25 వేల ఎకరాలకు సాగునీరు–తాగునీరు అందించేందుకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేతిగుట్లపల్లె, ఆవులపల్లె రిజర్వాయర్లలో 3.50 టీఎంసీల నీటి నిల్వ చేసేందుకు రెండు రిజర్వాయర్ల నిర్మాణాలకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారు. దీని పనులు వేగవంతం చేశారు. నేతిగుట్లపల్లె ప్రాజెక్టును పూర్తి చేశారు. ఆవులపల్లి ప్రాజెక్టు పనులు చేస్తుండగా తెలుగుదేశం పార్టీ వారు పెద్దిరెడ్డికి మంచిపేరు వస్తుందన్న దురుద్దేశంతో ప్రాజెక్టు పనులపై కోర్టులో వేసి పనులు ఆపించారు. దీంతో ప్రాజెక్టులు అర్ధంతరంగా ఆగిపోయాయి. కేసులు తక్షణమే ఉపసంహరించుకుని ప్రాజెక్టులు పూర్తిచేయాలని, ప్రాజెక్టులో రైతులకు అందించాల్సిన పరిహారం రూ.54 కోట్లను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే మండలంలోని మేలుందొడ్డి సమీపంలో నిర్మించనున్న జర్మన్ పెప్పర్‌మోషన్ ఎలక్ట్రిక్ బస్సులు, ట్రక్కుల కంపెనీ ఏర్పాటుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని, కంపెనీకి సహకరించాలని ప్రజలు, నిరుద్యోగులు కోరుతున్నారు. అలాగే మండలంలోని ఆరడిగుంట వద్ద నిర్మిస్తున్న శ్రీకాళహస్తి ఫెరాఆలాయిల్ కంపెనీ నిర్మాణాలకు అధికార పార్టీ వారు అనేక ఇబ్బందులు పెడుతున్నారని, ఇలాంటి కంపెనీలకు సహకరించి పుంగనూరును పారిశ్రామిక వాడగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టండి



పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

వి.కోట: వి.కోట మండలం మూడు రాష్ట్రాల కూడలి కావడంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని, రోడ్డు భద్రతా నియమాలపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతం చేసి పరిష్కరించాలన్నారు. సీఐ లింగప్ప, ఎస్‌ఐ బాబు పాల్గొన్నారు.

ఆధార్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోండి

రొంపిచెర్ల: ఆధార్ డ్రైవ్‌ను ఐదేళ్లలోపు పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష మంగళవారం తెలిపారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 400 మంది విద్యార్థులు ఆధార్ కార్డులు లేకుండా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారం ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. అదేవిధంగా పిల్లలకు కూడా ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా పౌష్టికాహారం ఇచ్చే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈనెల 27 వరకు ఆధార్ డ్రైవ్ జరుగుతుందని తెలిపారు. రొంపిచెర్ల-2, మోటుమల్లెల గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మోటుమల్లెల గ్రామ పంచాయతీ పిల్లలు మోటుమల్లెల, మిగిలిన వారికి రొంపిచెర్లలో పిల్లలందరికి ఆధార్ నమోదు చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చెట్లు నరికేస్తున్నా పట్టించుకోవట్లేదు!

- రోజూ 10 ట్రాక్టర్ల కలప తరలింపు
- మామూళ్ల మత్తులో రెవెన్యూ, అటవీశాఖ అధికారులు
- ప్రభుత్వ ఆశయానికి తూట్లు



గాజులవారిపల్లెలో ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలప

చౌడేపల్లె: మండలంలోని అటవీ ప్రాంతాలతోపాటు రైతు పొలాల్లో ఏపుగా పెరిగిన ఏళ్ల నాటి వృక్షాలను దర్జాగా నరికేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వృక్ష సంపదను రక్షించాల్సిన అటవీ, రెవెన్యూశాఖ అధికారుల అండదండలతోనే వ్యాపారం మూడు పూవులు ఆరు కాయల చందం సామెతలా సాగుతోంది. నిత్యం చౌడేపల్లె మండలంలోని దిగువపల్లె, వెంగళపల్లె, బోయకొండ, గాజులవారిపల్లె నుంచి ట్రాక్టర్‌లలో కలపను భర్తీ చేసి వివిధ ప్రాంతాలకు రాత్రి పూట తరలిస్తున్నారు. విలువైన అటవీ సంపదను సైతం దోచేస్తున్నారు. రోజూ 10 ట్రాక్టర్ల కలప తరలించేస్తున్నా అధికారులు మామూళ్ల మత్తులో పట్టించుకోవడం లేదని గ్రామాల్లో ప్రచారం సాగుతోంది. ప్రభుత్వం మొక్కలను పెంచి వాటిని సంరక్షించడానికి ఏటా కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తున్నప్పటికీ ప్రభుత్వ ఆశయం కింది స్థాయిలో అమలు చేయకపోవడంతో నిధులన్నీ నిర్వీర్యం అవుతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అక్రమ కలప రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

తప్పని కరెంట్ కోతలు!

- గంటకు ఒకసారి లైన్ ట్రిప్
- పట్టణంలోనే ఇలా ఉంటే ఇక పల్లెల మాటేంటి

పలమనేరు: గత కొన్నాళ్లుగా పలమనేరు పట్టణంలో కరెంట్ కోతలు తప్పడం లేదు. దీంతో ప్రజలకు చాలా ఇబ్బందిగా మారింది. పట్టణంలో 24 వేల కుటుంబాలున్నాయి. గంటకోసారి కరెంట్ అంతరాయం కారణంగా పట్టణ వాసులకు కష్టాలు తప్పడం లేదు. ముఖ్యంగా పాతపేట, రాధాబంగ్లా ఫీడర్లలో ఎప్పుడు కరెంట్ ఉంటుందో, ఎప్పుడు పోతుందో అంతు చిక్కడం లేదు. పట్టణంలో ఇప్పటిదాకా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు అధిక లోడ్ కారణంగానే ఇలాంటి సమస్యలున్నట్టు ట్రాన్స్‌కో సిబ్బంది చెబుతున్నారు. ఇక మండలంలోని పల్లెల్లోనూ ఇదే సమస్య నెలకొంది. గ్రామాల్లో త్రీఫేజ్ కరెంట్‌ను వ్యవసాయ మోటార్లకు వినియోగిస్తున్నారు. ఈ కరెంటు మూడు ఫేజ్‌ల్లో సరఫరా చేస్తూ మిగిలిన సమయాల్లో పవర్ ఆఫ్ చేస్తున్నారు. ఈ సమయంలో ఇళ్లకు కరెంట్ ఉండదు. ఫలితంగా గ్రామీణ ప్రాంత వాసులకు కరెంట్ సమస్యలు తప్పడం లేదు. ఇకనైనా పట్టణంలో కరెంట్ కోతలను అరికట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక ట్రాన్స్‌కో ఏడీ చిన్నబ్బను వివరణ కోరగా.. పట్టణంలోని గంటావూరు, మండలంలోని మండిపేట కోటూరులలో కొత్త సబ్‌స్టేషన్లను నిర్మించనున్నామని, అదేవిధంగా టి.వడ్డూరు సబ్‌స్టేషన్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇవి అందుబాటులోకి వస్తే పట్టణంలో పవర్ సమస్యలు పూర్తిగా తొలగి నాణ్యమైన కరెంట్ సరఫరా ఉంటుందన్నారు. ఇక గ్రామాల్లో త్రీఫేజ్ కరెంట్‌తో పాటు ఇళ్లకు 24 గంటలు కరెంట్ సరఫరా చేసేలా ఇప్పటికే పనులు చేపడుతున్నామని తెలిపారు.

వామ్మో.. తమిళనాడు రోడ్డు!



పేర్నాంబట్ రోడ్డులో దెబ్బతిన్న ప్రహరీగోడ



గుడియాత్తం రోడ్డులో ప్రమాదకరంగా ఘాట్ రోడ్డు

- ఆదమరిస్తే అంతే సంగతులు
- అంతర్రాష్ట్ర రహదారిలో ప్రమాదకరంగా ఘాట్
- పలుచోట్ల దెబ్బతిన్న ప్రహరీగోడ
- ఇప్పటికే పలు రోడ్డు ప్రమాదాలు

పలమనేరు: నియోజకవర్గంలోని పలమనేరు నుంచి తమిళనాడు రాష్ట్రంలోని గుడియాత్తంకు, వి.కోట నుంచి పేర్నాంబట్‌కు వెళ్లే రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఇక్కడికి సమీపంలోని కౌండిన్య అటవీ ప్రాంతంలో వెళ్లే ఈ అంతర్రాష్ట్ర రహదారుల్లో వాహనచోదకులు ఏ మాత్రం ఆదమరచినా ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నట్లే. ప్రమాదకరంగా ఉన్న ఈ రెండు రహదారుల్లో ఇప్పటికే పలు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. గతంలో వి.కోట మండల సరిహద్దులోని ఏడుచుట్లకోట ఘాట్‌లో లారీ లోయలోకి పడి ఇద్దరు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ పదేళ్లలో ఈ ఘాట్‌లో 20 దాకా ప్రమాదాలు జరిగాయి. ఇక పలమనేరు నుంచి గుడియాత్తంకు వెళ్లే సామచేనుమిట్ట ఘాట్‌లో 10దాకా ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

దెబ్బతిన్న ప్రహరీగోడ..

ఈ రెండు మార్గాలు అడవిలో ఉన్నవే. అటవీమార్గంలో ఓ వైపు భారీ లోయ, మరోవైపు కొండ లున్నాయి. పలమనేరు– గుడియాత్తం మార్గంలో 16 కిమీ లోయ ప్రాంతంలో రోడ్డుకు ఓ వైపు ఏర్పాటు చేసిన ప్రహరీ గోడ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. కొన్నిచోట్ల అసలు సైడ్ వాల్ నిర్మాణమే జరగలేదు. ప్రమాదకర మలుపుల వద్ద సూచిక బోర్డులు కూడా లేవు. ముఖ్యంగా దొమ్మరపాపమ్మ గుడి నుంచి తమిళనాడులోని శ్యామచేనుమిట్ట వరకు రోడ్డు ప్రమాదకరంగా ఉంది. ఈ మార్గంలో కొత్తగా వచ్చే డ్రైవర్లు కాస్త నిర్లక్ష్యం చేస్తే వందల మీటర్ల కిందనున్న లోయలోకి వాహనాలు పడిపోవాల్సిందే. వి.కోట–పేర్నాంబట్ మార్గంలో ఏడుచుట్లుకోట ఘాట్ మరీ ప్రమాదకరంగా ఉంది. దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రహరీగోడ దెబ్బతింది. ఇప్పటికైనా అధికారులు ఘాట్‌రోడ్లలో మన రాష్ట్ర సరిహద్దులదాకా అవసరమైన నిర్మాణాలను చేపట్టి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

28న శివాలయంలో ఆడికృత్తిక

చౌడేపల్లె: మండల కేంద్రంలోని శ్రీఅభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ ఆవరణలో వెలసిన శ్రీ షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఈనెల 28 ఆదివారం నుంచి ఆడికృత్తిక మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఈఓ కమలాకర్ తెలిపారు. 28న భరణి కావిళ్లు, 29న సోమవారం కృత్తిక కావిళ్లు ఉదయం 11 గంటలకు పుష్ప కావిళ్లు చెల్లిస్తారన్నారు. అలాగే ఆదివారం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామివారి వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. సోమవారం రాత్రి స్వామివారి ఉత్సవమూర్తులను నెమలి వాహనంపై ఊరేగింపుతో కార్యక్రమం ముగుస్తుందన్నారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్మిక వ్యతిరేక విధానాలను అడ్డుకుంటాం



మాట్లాడుతున్న నాగరాజు

పుంగనూరు: కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలతో కార్మికులకు బతుకు తెరువు లేకుండా చేస్తోందని, దీనిని అడ్డుకుంటామని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు హెచ్చరించారు. మంగళవారం స్థానిక కార్మికులతో కలసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హమాలీలు, ఆటో, భవన కార్మికుల సంక్షేమంతో పాటు ప్రతిఏటా ఆరోగ్య సమస్యలు పరిష్కరించాలన్నారు. అలాగే గుర్తింపు కార్డులు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నేతలు వెంకటేశు, దామోదరం, రామమూర్తి, మున్నా, సురేష్, రమణ, జయకుమార్ పాల్గొన్నారు.

నెలవంకను మరిపించే గుడివంక

- భక్తుల పాలిట కొంగు బంగారం వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి
- నేటి నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు



వల్లీ దేవసేన సమేత సుబ్రమ్మణ్యస్వామి



ముస్తాబైన గుడివంక ఆలయం

గుడుపల్లె: చుట్టూ ఎత్తైన కొండలు, లోతైన వంకల మధ్య ప్రకృతి అందాలతో గుడివంక ఆలయం భక్తులకు కనువిందుచేస్తోంది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లోని పశ్చిమ వాహిని సమీపంలోని వేపమాను కొండపై వెలసిన శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి భక్తుల పాలిట కొంగుబంగారంగా నిలిచారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు ముందుగా పశ్చిమ వాహినిలో స్నానాలు ఆచరించి స్వామి అమ్మవార్లను దర్శించుకుంటారు. తిరుగు ప్రయాణంలో సమీపంలోని గంగాధరేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తారు.

ప్రతిఏటా ఆడిమాసంలో గుడివంకలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఆడిమాసంలో జరిగే బ్రహ్మోత్సవాలకు భక్తులకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తూ కొండపై అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు కావళ్లను ఎత్తుకుని మొక్కులు తీర్చుకుంటారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు..

గుడివంక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం అవుతాయని దేవదాయశాఖ అధికారులు తెలిపారు.

భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం



వారం రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తులకు కొండపై నీరు, అన్ని వసతుల తోపాటు అన్నదానానికి ఏర్పాట్లు చేశాం. కుప్పం నుంచి గుడివంకకు ప్రతి అరగంటకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది.

– చలపతి, ఆలయ ఈఓ